


# 29

# ఆదివారం

కాలింగ్ బెల్ రెండు మూడుసార్లు నొక్కి, ఫలితం లేక, (అది స్విచ్ ఆఫ్ చేశారు) తలుపు పై టకటక మంటూ చప్పుడు చేస్తున్నారెవరో. ఈ చప్పుళ్ళు వస్తూనే వుంటాయి. సబ్బులో, సర్ఫో అంటూ సేల్స్ గరల్స్, సేల్స్‌మాన్, లేదా పక్క అపార్ట్‌మెంటు పిల్లలో, ఒక్కోసారి బలమైన గాలికో, లేదా చప్పుడులాంటి భ్రమో తీరా తలుపుతీస్తే ఎవరూ ఉండరు.

ఈసారి కిటికీ అద్దంపై టకటకమని చప్పుడు. చప్పుడులో ఒక వేగం, ఆదుర్దా. అన్నపూర్ణ రెప్పలు పైకెత్తి రామసుందరం వైపు చూసింది. వేడి కాఫీ నాలుక పై నుంచి గొంతులోకి జారుతుండగా హాయైన అనుభూతిని పొందుతుంది అన్నపూర్ణ. ఆ అనుభవాన్ని డిస్టర్బ్ చేసుకోదలుచుకోలేదు.

ఇంకా బ్రేక్‌ఫాస్ట్ కార్యక్రమం ఉంది. నిన్న ఎప్పుడో నాన బోసిన మినప్పప్పు గ్రైండర్‌లో రుబ్బుకోవాలి. రుబ్బిన పిండి అర చేతిపై గుండ్రని రూపాలుగా మారి, వేడివేడి నూనెలో గారెలుగా వేగి ఇద్దరూ ఎదురెదురు గా కూర్చుని వాటి రుచిని ఆస్వాదిస్తూ ఆ కార్యక్రమం అట్లాగే ఉంది. కొబ్బరిపచ్చడిలో నేతిని వేసి, అందులో గారెల్ని అద్దు కుంటూ, వాళ్ళిద్దరే, ఒంటరిగా, రుచులు రేకెత్తించే

జ్ఞాపకాల్ని చెప్పుకుంటూ ఈ సుఖాన్ని వదులుకొని తలుపుపైనో, కిటికీపైనో టకటక మనే చప్పుడు కోసం, లేచి, నడిచి, తలుపుదాకా వెళ్ళి, ఊహు అదీ కాక, ఈ రోజు ఆదివారం. రామసుందరానికి ఆఫీసులేదు. ఆఫీసుకు తయారయ్యే కార్యక్రమం లేదు. ఆరు గంటలకే లేచి, పాలకోసం పరిగెత్తే పనిలేదు. పాలబూత్ దగ్గర కబుర్లు లేవు. టాయిలెట్ లో కూర్చుని, పేపరు చదవడం, షేర్ల గురించి దిగులుపడటం లేదు. ఇది ఆదివారం. ఒక ఒంటరి శూన్యం. మహా అయితే ఇవాళ అమెరికా నుంచి వాళ్ళ పెద్దకొడుకు దగ్గర నుంచి ఫోన్‌కాల్ రావచ్చు. అదీ ఏ మధ్యాహ్నమో. అయితే ఈమధ్య రెండు నెలలుగా ఆ ఫోనూ రావటం లేదు.

రెండోవాడు ఇల్లు వదిలి వెళ్లిపోయాడు. ఇంటికి రాడు, ఫోన్లు చెయ్యడు. చానాళ్ళ క్రితం లవ్ ఎఫైర్‌లో ఫెయిలయ్యాడు. మూడుసార్లు గ్రూప్ వన్ పరీక్షల్లో సెలక్ట్ అవలేదు. కొన్నాళ్ళు హ్యూమన్ రైట్స్ ఉద్యమంలో పనిచేశాడు. ఇప్పుడు కల్కి భగవాన్ భక్తి సమాజంలో చేరాడు. గుండు చేసుకొని, కాషాయం దుస్తులు వేసుకొని, అన్నపూర్ణకు వాడు కలల్లోనే కనిపిస్తాడు. పొడవాటి జుట్టు, గాలికి ఊగుతుండగా, గుర్రంపై స్వారీ చేస్తూ కనిపిస్తాడు. అందంగా నవ్వుతాడు. 'బై అమ్మా' అంటూ చేతులూపుతాడు. వాడి కోసం చేతులు చాస్తుంది అన్నపూర్ణ. వాడు అశ్వంతో సహా మాయమవుతాడు. సరస్సుల అడుగున స్వారీ చేస్తాడు. రెండు చేతులతో సరస్సునంతా గాలిస్తుంది అన్నపూర్ణ. గుర్రపు శరీరాలు చేతులకు తగులుతుండగా ఉలిక్కిపడి లేస్తుంది అన్నపూర్ణ.

అన్నపూర్ణ కలలు, కొద్ది నిముషాల షార్టు ఫిలిమ్స్‌లా వుంటాయి. అవి జ్ఞాపకాలో, కలలో తేడా తెలియనట్లు ఉంటాయి. చిన్నప్పుడొకసారి, రాత్రి, భోజనంటైంలో పిల లిద్దర్నీ 'అన్నానికి రమ్మని' కేకవేసింది. పెద్దవాడు, అప్పటికే వంటగదిలోకి దూరి చికెన్ ముక్కల్ని ప్లేటులో వేసుకుంటున్నాడు. చిన్నవాడి కోసం వెతుకుతుంటే, వాడు, బయట పోర్టికోలో ఒక్కడే నిలబడి, తలకు కండువాగుడ్డను చుట్టుకొని, రెండు చేతులు ఆకాశం వైపు సాచి, "నేను షేక్స్‌పియర్ని, నేను హామ్లెట్‌ని, నేను శ్రీశ్రీని, మార్క్సుని, ఎన్‌కౌంటర్ కాబడుతున్న నక్సలైట్‌ని," అంటూ పెద్దగా అరుస్తున్నాడు. అన్నపూర్ణకేం అర్థంకాలేదు. వాడి రెక్కపట్టుకొని లోపలికి లాక్కువచ్చింది. ఆవేళ్టి దృశ్యం, నాటకంలోని సన్నివేశంలా అన్నపూర్ణకు పదేపదే గుర్తుకు వస్తూనే ఉంటుంది.

చట్నీ కోసం, కొబ్బరి ముక్కలు, ఉల్లిపాయలు, పచ్చి మిరపకాయలు ఎదురుగా పెట్టుకుంది అన్నపూర్ణ. రామసుందరం డైనింగ్ టేబుల్‌పై కూర్చుని దరువు వేస్తున్నాడు ఆకలితో. పేపరు తీసి, టీవీ గైడ్‌లో ఆవేళ చూడవలసిన ప్రోగ్రాముల్ని టిక్ చేస్తున్నాడు. అన్నపూర్ణ మరో కప్పు కాఫీ (వేడి వేడిగా) సిప్ చేస్తూ, మిక్సీ ఆన్ చేసింది. రామసుందరం ఆరోజు టీ.వీ.లో క్రికెట్ మ్యాచ్ చూడడానికి నిర్ణయించుకున్నాడు. టి.వీ. ముందు ఈజీ

చైర్ వేసుకొని, బిస్కెట్ పాకెట్లు, నీళ్ళ బాటిల్ పెట్టుకొని, మ్యాచ్ కోసం అంతా సిద్ధం చేసుకున్నాడు.

అన్నపూర్ణ స్టౌ వెలిగించి, దానిపై బాండీ పెడుతుండగా, ఫోన్ మోగింది రామ సుందరం ఫోన్ ఎత్తుదామని లేచి, వీపులో సన్నని నొప్పి అనిపించి, ఈజీ చైర్‌లో వెనక్కు జారబడ్డాడు. అన్నపూర్ణ తీస్తుందని చూశాడు. అన్నపూర్ణ ఫోన్ ఉనికిని పట్టించుకోకుండా, వేగిన నూనెలో గారె పిండిని వేసి, అది సుయ్యిమని చప్పుడు చేస్తూంటే దానివైపే చూస్తూ నిలబడింది. కాసేపు మోగి, ఫోన్ ఆగిపోయింది. గారెలు చెయ్యటం అయినాక మరోసారి కాఫీ కలుపుకొని హాలులోకి వచ్చింది అన్నపూర్ణ. మధ్యాహ్నం వంట గురించి చాలాసేపు చర్చించుకున్నారు వాళ్ళు. ఫ్రిజ్‌లోని మటన్‌ను గోంగూరతో కలిపి, గోంగూర మాంసం చేస్తానని అన్నపూర్ణ, మటన్ ఫ్రైగానీ, కుర్మాగానీ చెయ్యమని రామసుందరం. గోంగూర మాంసం వాళ్ళింట్లో ఆల్‌టైం ఫేవరేట్. ఇద్దరు పిల్లలకూ ఆ కూరంటే ఇష్టం. ప్రతి ఆది వారం కావాలని మారాం చేసేవాళ్ళు. ఐదేళ్ళ క్రితం రెండోవాడు, హఠాత్తుగా "ఒక్కపూట అన్నం కూడా తినలేని వాళ్ళున్న దేశంలో, ఇంత లగ్జరీ భోజనం నేను తినలేను. ఇవాళ నుంచి నేను నాన్-వెజిటేరియన్ మానేస్తున్నాను," అని ప్రకటించాడు. వాడి ప్రకటనను చాలా తేలికగా తీసుకొంది అన్నపూర్ణ. కానీ నిజంగా వాడు ఆరోజు నుంచి నాన్-వెజిటే రియన్ మానివేశాడు.

ఈ రోజు అన్నపూర్ణ, తనకిష్టమయిన గోంగూర మాంసం చేయడానికి నిర్ణయించు కుంది. టి.వీ ముందు సెటిల్ అయ్యి, క్రికెట్ ప్రసారం కోసం ఎదురుచూస్తున్నాడు రామసుందరం. పడకకుర్చీ అటూ ఇటూ రెస్ట్‌లెస్‌గా ఊగుతూ, కిర్‌కిర్‌మని చప్పుడు చేస్తుంది.

రెండోవాడు ఆశ్రమంలో ఎందుకు ఉంటున్నాడో, వారానికొక సారయినా యింటి కెందుకు రాడో వాళ్ళకు అర్థంకాదు. ఇల్లంటే వాడి కెందుకు ద్వేషమో తెలియదు. కొన్నాళ్ళు విద్యార్థి రాజకీయాల్లో తిరిగాడు. డ్రగ్ ఎడిక్షన్ గురించి సందేహాలు కలిగాయి. ఏ ఆధారం దొరకలేదు. ఆ మధ్యకాలంలో చాలా కాంపిటేటివ్ పరీక్షలు రాశాడు. రిజల్ట్సు వచ్చిన రోజు, పిల్లవాడిలాగ జుట్టు పీక్కుని ఏడ్చేవాడు. ఇంటికి ఫోన్‌చేసి, "నన్ను క్షమించండి," అని ఏడుస్తాడు.

వంటచేస్తూ, మధ్యమధ్యలో టి.వీ. దగ్గరకు వచ్చి, తనకిష్టమైన 'మా యింటి వంట' కార్యక్రమాన్ని పెట్టుకొంది అన్నపూర్ణ. ఇద్దరూ టి.వి. రిమోట్ కోసం కాసేపు వాదు లాడుకున్నారు. బయట తలుపుపై మళ్ళీ శబ్దం అయింది. పూర్ణ 'మా యింటి వంట' చూస్తూ, విసుగ్గా తలుపు వైపు చూసింది. తలుపుపై మళ్ళీ చప్పుడైంది. అసహనంగా అటువైపు చూసింది. కానీ తలుపు తీయడానికి అటు వెళ్ళలేదు.

పదకొండు గంటలకే వంట పూర్తయింది. అన్నం, కూర గిన్నె లని టేబుల్‌పై సర్దుతుండగా గోడలపై పెద్దగా బాదుతున్న చప్పుడు దబదబమని రిథమిక్‌గా చాలాసేపు. క్షణంసేపు ఆ శబ్దాలవైపు చూసింది అన్నపూర్ణ. గోడవైపు నడిచి, దానిపై తన చేతిని వుంచి, ఆ శబ్దాన్ని అనుకరిస్తున్నట్లు, దబదబమని, తనలో తాను గొణుక్కుంది.

అన్నపూర్ణకు రెండో కొడుకు గుర్తుకొచ్చాడు. ఎప్పుడూ గదిలోనే ఉండేవాడు. తలుపులు బిగించుకొని వాడు రోజంతా గదిలో ఏం చేస్తుండేవాడో అర్థం అయ్యేది కాదు అన్నపూర్ణకు. అప్పుడప్పుడు వాడి గదిలోంచి శబ్దాలు వినిపిస్తూ ఉండేవి. వాడు తనలో తాను మాట్లాడుకుంటున్నట్లు, నిరంతరం వాడిగదిలోంచి మాటలు వినబడు తుండేవి. ఒక్కోసారి వాడు ఎవరి నుద్దేశించో, గంభీరమైన ఉపన్యాసం ఇస్తున్నట్లుండేది. ఇంకోసారి కవిత్వం పెద్దపెద్దగా చదువుతున్నట్లుగా. అన్నపూర్ణ గోడలకు చెవుల్ని పెట్టి వినేది. ఆ శబ్దాల్ని మాటలుగా అనువదించాలని చూసేది.

మధ్యాహ్నామైంది. ఆహ్లాదకరంగా ఉన్న వాతావరణం వేడెక్కుతున్నది. టి.వీ.లో సినిమా వచ్చే టైము. అన్నపూర్ణ, రామసుందరం, ఇద్దరూ త్వరగా అన్నం తినాలని నిర్ణ యించుకున్నారు. డైనింగ్ టేబుల్ పై కూర్చుని వడ్డించుకున్నారు. రెండు ముద్దలు కూడా తినలేదు రామసుందరం. మిగిలిన కూరంతా ఏం చేసుకోవాలో అర్థంకాలేదు అన్నపూర్ణకు. ఫ్రిజ్‌లో పెట్టి రాత్రికి, రేపు ఉదయానికి అంటూ ఆలోచిస్తుండగా తలుపుపై ఎవరో బలంగా మోదిన చప్పుడైంది. ఆ శబ్దం వెంటాడుతున్నట్లుగా ఉంది. ఎవరో ఏ ఆపద లోంచో, ఇబ్బందిలోంచో, భీతితోనో, తలుపు తట్టుతున్నట్లుగా;

అన్నపూర్ణ, మిగిలిన కూరను ఫ్రిజ్‌లో సర్దుతుంది. రామసుందరం పడుకోడానికి బెడ్‌రూమ్ వైపు కదిలాడు. అతను బెడ్‌రూమ్‌కు వెళ్ళినాక, టి.వి. ముందు కూర్చుని మధ్యాహ్నపు సినిమాను చూడటం మొదలుపెట్టింది. తలుపుపై తడుతున్న శబ్దం ఆగిపో యింది. అన్నపూర్ణ కూర్చున్న పడకకుర్చీ అటూ ఇటూ ఊగుతూ కిర్‌కిర్ శబ్దం విని పిస్తుంది.

మధ్యాహ్నం మూడుగంటల సమయంలో గాఢమైన వాసన లేవో వచ్చి, డిస్టర్బ్ అయ్యారు వాళ్ళిద్దరు. టి.వి. ముందు కూర్చున్న అన్నపూర్ణ అసహనంగా కదిలింది. మంచంపై నిద్రరాక, నిద్రపోలేని స్థితిలో, ఆ నిద్రలో మంచంపై శరీరాన్ని, అటూ ఇటూ దొర్లిస్తున్న రామసుందరం కూడా ఉలిక్కిపడ్డాడు. ఆ వాసనల ఘాటుకు.

పొగలు పొగలుగా వస్తున్న సాంబ్రాణి కడ్డీల పొగ. ప్రవాహంలా తోసుకొస్తుంది. ఘాటుగా, క్రూడ్‌గా, దుఃఖపు తడినో, దిగులునో మోసుకొస్తున్నట్లుగా. అసహనంగా కిటికీ తలుపుతీసి చూసింది అన్నపూర్ణ. కింద ఎఫ్2 అపార్ట్‌మెంటు ముందు షామియానా వేసి ఉంది. పదో ఇరవయ్యో కుర్చీలు వేసున్నాయి. ఖాళీగా ఉన్నాయి. షామియానా

ముందు చిన్న చిన్న గుంపులు. లోపల నుండి ఉండీ ఉండీ ఒక రోదన, వినపడీ వినపడ నట్లుగా. "ఎవరిదో చావు," అంది అన్నపూర్ణ యథాలాపంగా. "ఎవరట," అన్నాడు రామ సుందరం మంచం గదిలోంచే, బయటకు రాకుండా. అన్నపూర్ణ మాట్లాడలేదు. ఇంక చూసేదేమీ లేదు అనుకుని, వెనక్కు టి.వీ.వైపు వెళ్ళాలనుకుంది. కానీ ఎందుకో కదల లేకపోయింది. చూపులు ఆ ప్రదేశం పైనుంచి మరల్చుకొని, తూర్పు వైపుకు చూసింది. పదహారు అంతస్తుల 'అజంతా హోమ్స్', మహా పర్వతంలా కనబడింది. నిశ్శబ్దంగా, మనుషులెవరూ లేనట్లుగా. సూర్యుడి ఎండ ఆ బిల్డింగ్ పై పడి బంగారపు రంగులేవో మిలమిలలాడుతున్నాయి. చిట్టచివరి అంతస్తుపై ఐదో, పదో పావురాళ్ళు సన్నటి గీతల్లా కనిపిస్తున్నాయి. అవి కదులుతున్నాయో, లేదో తెలియటం లేదు. అన్నపూర్ణ చాలాసేపు వాటివైపే చూస్తూ నిలబడింది. "టీ, ఏదయినా..." లోపలి నుంచే గొణిగాడు రామ సుందరం.

అన్నపూర్ణ మౌనంగా లోపలికి నడిచింది. స్టౌవ్ వెలిగించి, టీ పొడి మరిగిస్తుం డగా, మరోసారి, తలుపులపై చప్పుడైంది. "చనిపోయిన మనిషి తాలూకు వాళ్ళేమో," అన్నాడు రామసుందరం నిద్ర గలోంచి. విననట్టే ఉండిపోయింది అన్నపూర్ణ. మంద్రంగా, వినపడీ వినపడని శబ్దం, ఎవరో మృదువుగా పిలిచినట్లు

అన్నపూర్ణ టీ కాయటం పూర్తిచేసి, రెండు కప్పుల్లో నింపుకొని, టీవీ గదిలో కొచ్చింది. "టీ రడీ అయ్యింది," అంది రామసుందరాన్ని ఉద్దేశించి. రామసుందరం లేచి, బెడ్‌రూమ్ కిటికీలోంచి, కిందకి తొంగి చూశాడు. చిటపటలాడుతున్న సూర్యుడిపై, హఠాత్తుగా నల్లటి మబ్బు దాడిచేసినట్లు, సాయంకాలమైనట్లుగా, నల్లగా, మబ్బు మబ్బుగా 'బహుశా దిగులు దిగులుగా' అని మనసులో అనుకున్నాడు రామసుందరం. బట్టలు తొడుక్కొని, ఆ చనిపోయిన మనిషి యింటికి వెళ్ళి, పలకరించాలని అను కున్నాడు రామసుందరం. కానీ లోలోపల 'వద్దు వద్దు' అంటూ ఒక ప్రతిఘటన. చావు అంటే అతనికి భయం. శవాన్ని దగ్గరగా చూడాలంటే భయం. ఎప్పుడో, ఎక్కడి నుంచో, ఒక చావుకబురు అతన్ని వెతుక్కుంటూ వస్తుందేమోనని, నిరంతరం భయపడుతూ ఉంటాడు.

ఎక్కడో కాకులు అరుస్తున్న చప్పుడు. కా, కా అని, వికృతంగా ఉన్నాయా అరుపులు. పక్కవీధిలో ఎవరిదో పెంపుడుకుక్క భీకరంగా అరుస్తుంది. టీ తాగు తుండగా, టీ వాసనతో పాటు, మరేదో వాసన, అగరువత్తుల వాసనో, చావు వాసనో, మరింకే వాసనో, కడుపులో తిప్పినట్లనిపించింది రామసుందరానికి.

కిటికీ మూసి, పడకకుర్చీలో కూలబడ్డాడు. కళ్ళు కిందకు దించుకొని, నేలవైపు చూస్తూ ఎందుకో అన్నపూర్ణ కళ్ళలోకి సూటిగా చూడలేకపోతున్నాడు. టీ.వీలో వార్తలు

వస్తున్నాయి. పాకిస్థాన్‌లో, ఆఫ్ఘనిస్థాన్‌లో బాంబు పేలుళ్ళు చూపిస్తున్నారు. తెగిన అవయవాలు, రక్తమోడ్చే శరీరాలు 'ఎందుకిట్లాంటి దృశ్యాలు చూపిస్తారు' అనుకుంటూ కసిగా ఛానల్ మార్చాడు. నిరంతరం సినిమా పాటలు చూపించే ఛానల్‌కు మార్చాడు.

"తిండానికేమయినా ఉందా," అన్నపూర్ణవైపు చూస్తూ. అన్నపూర్ణ ఏం మాట్లాడ లేదు. కారంబూందో, చెక్కలో, టిఫిన్‌బాక్స్‌లో ఉన్నట్లు గుర్తు. ఎందుకో తేవాలని పించలేదు. ఒక మూలన నేలపై కూలబడి, జడ విప్పుకొని, తీరిగ్గా జుట్టును దువ్వు కోవటం మొదలుపెట్టింది. పొడవాటి జుట్టును పదే పదే దువ్వుతూ, గమ్యంలేని బాట సారిలా దువ్వెన, తల పొడవునా, సంచరిస్తూ, నేలపై రాలి పడుతున్న వెంట్రుకలు, ఎంతో దీక్షగా, కసిగా, కాసేపు పరిసరాల్ని మరిచిపోయింది అన్నపూర్ణ.

రామసుందరం, ఏదో గుర్తుకొచ్చినవాడిలా కిటికీ దగ్గరకు వెళ్ళాడు. షామియానా వేసిన ప్రదేశంలో జనం పెరిగిపోయారు. చనిపోయిన మనిషిని బయటకు తెచ్చారు. అతని శరీరంపై పూలదండలు, పూలు. అగరువత్తుల వాసనకు, పూలవాసనలు కలిసి, పొగలుపొగలు అక్కడ అంతా సుడులు తిరుగుతూ, ఆ వాసనకు కడుపులో తిప్పు తున్నట్లుగా, ఏం వాసన యిది. 'చావు వాసన యిలాగే ఉంటుందా' అనుకుంటూ, అసహనంగా కిటికీ మూసేసి, హాలులోకి వచ్చాడు. పాటలు పాడుతున్న టి.వీ.ని ఆపేశాడు. ఇల్లాంతా నిశ్శబ్దం. అన్నపూర్ణ తలను దువ్వుతూనే ఉంది దీక్షగా, ప్రశాంతంగా.

"ఓల్డ్ ఆంటీ, ఓల్డ్ అంకుల్" అంటూ బయట పిల్లవాడెవరో అరుస్తున్నాడు. తలుపు పెద్దగా బాదుతూ. కాళ్ళతో, చేతుల్తో మొత్తం శరీరంతో తలుపు పై దాడి చేస్తున్నట్లుగా.

"రేయ్, ఎవడ్రా అది" అని పెద్దగా అరవాలనుకున్నాడు రామ సుందరం. ఆలోపు గానే శబ్దాలు ఆగిపోయాయి. 'ఎవరు, ఎవరది?' అన్నాడు, సన్నటి కీచుగొంతుతో, అలా అంటూ గట్టిగా నిట్టూరుస్తూ రెండు చేతుల్ని తలపై పట్టుకొని, స్తబ్దంగా, విగ్రహంలా, ఎక్కడో చూసిన ఒకానొక దృశ్యంలా, అట్లాగే ఆ భంగిమలో చాలాసేపుండి-

"పూర్ణా"

'ఊ' అంది అన్నపూర్ణ, కురుల సముద్రంలోంచి తలపైకెత్తి,

"ఇక వాడు రాడు"

"ఎవరు?"

"మురళి, పెద్దోడు. చిన్నోడు నయం, బైరాగిలానో, సన్యాసి లానో కళ్ళముందే ఉంటున్నాడు. కాని పెద్దోడే.... నాతో మాట్లాడుతున్నట్లుగా ఉంది, కళ్ళముందే ఉన్నట్లు గానే ఉంది వాడి రూపం,"

"ఇప్పుడవన్నీ ఎందుకు? పిల్లలు పెద్దవాళ్ళయినారు. వాళ్ళ జీవితాలు వాళ్ళవి."

"కోడలకు మనమంటే ఇష్టం లేదు," రామసుందరం మాట్లాడుతూనే ఉన్నాడు. అన్నపూర్ణ వినడం మానివేసింది.

రామసుందరం, తలపై చేతులు తీసి, కుడిచేతిని మెల్లగా జరుపుకుంటూ గుండె పైకి తెచ్చాడు. గుండెపై పొడవాటి స్కార్. బైపాస్ సర్జరీ తాలూకు స్కార్. ఆ స్కార్‌ను చాలాసేపు తడుముకున్నాడు. లేచి టేబుల్ పైనున్న ఖాళీ డైరీని తెచ్చి ముందు వేసు కున్నాడు. ఖాళీ ఖాళీగా ఉన్న తారీఖులు, నెలలు, సంవత్సరాలు. డైరీ పేజీల మధ్యన, సీతాకోకచిలుక ప్రెస్ చేయబడి, దాని రెక్కలింకా సజీవంగా రంగురంగులుగా మెరుస్తూ.

"టైం, ఎంతయ్యుంటుంది" అన్నాడు వంచిన తల ఎత్తకుండా. వాళ్ళ యింట్లో గోడ గడియారం లేదు. రామసుందరం రిస్ట్‌వాచీ కూడా పెట్టుకోడు. అన్నపూర్ణ టైంకోసం, టి.వీ ఛానల్‌ని వెతికింది. ముందుగది కిటికీ, భళ్ళుమన్న చప్పుడు. పిడికిలితో ఎవరో గట్టిగా బాదినట్లు.

"హరహర మహాదేవా," అంటూ పెద్దగా అరుస్తున్నారు కింద. శంఖం ఊదుతున్న చప్పుడు. బహుశా శవం కదిలి ఉంటుంది. అన్నపూర్ణ దువ్విన కురులకు నూనెను పూసే పనిలో ఉంది.

ఒక్కసారి పెనుగాలి ఏదో పైకి లేచినట్లు, బయట ఝుయ్యుమంటూ చప్పుడు. పగబట్టినట్లు, గాలిగోడలపై, తలుపులపై దాడి చేస్తున్నట్లు తలుపులు, కిటికీలు గాలికి ఊగుతూ, పెద్దగా చప్పుళ్ళు చేస్తూ నల్లటి మబ్బు, భూమినంతా ఆక్రమించుకొని, ప్రపంచానికి నల్లటి వస్త్రం కప్పింది.

రామసుందరం డైరీల్ని మూసివేశాడు. క్షణకాలం కళ్ళ ముందు ప్రత్యక్షమైన రంగుల దృశ్యం, సీతాకోకచిలుక శరీరం, కళ్ళ ముందు నుంచి అదృశ్యం అయ్యింది. పెద్దకొడుకు జ్ఞాపకం కూడా. చిన్న కొడుకు గురించిన ఆందోళన కూడా. అంతా ఖాళీగా, ఏ జ్ఞాపకం లేనట్లుగా.

తలుపు పై మళ్ళీ చప్పుడైంది. క్షణంసేపు, ఆ చప్పుడుకు, అతని శరీరంలో కూలు తున్న మహారణ్యాలు, మహాసర్పమేదో విసురుగా పడగవిప్పి బుస్సుమంటున్నట్లు అని పించి, గట్టిగా నిట్టూర్చి ఈజీ చైర్‌లో కూలబడ్డాడు.

దువ్విన కురులను ముడివేసుకొని, వంటగదిలోకి నడిచింది అన్నపూర్ణ.

*పాలపిట్ట మాసపత్రిక, ఫిబ్రవరి 2010*